# అనుభవం




ఆ చెట్టు దాటి గాలి తెరలు తెరలుగా వస్తోంది. గాలిలో తేలివచ్చి ఆ పాట కూడా కొంచెం కొంచెంగా వినపడుతోంది. కిటికీలో కూర్చున్న రామారావు మరి కొంచెం ముందకు జరిగాడు. ఆ పాట ఇంకొంచెం బాగా వినపడుతుందేమోనని.

వంద గజాల్లో ఉంది పెద్ద చింత చెట్టు. ఎప్పుడు, ఎవరు కట్టించారో ఆ చెట్టు చుట్టూ అరుగు - ఇప్పుడు ఒక పక్క పడిపోయి ఇటుకల కుప్ప మిగిలింది. అరుగు బాగున్నవేపు కూర్చుని ఉంది ఆమె.

మోకాలు మీద తల ఆన్చుకు కూర్చుని, కుడిచేతి వేళ్ళతో బీటలు తీసిన అరుగు మీద గీతలు గీస్తూ, తనకోసం తను పాడుకుంటూన్నట్టు పాడుకుంటోంది. కిటికీలో కూర్చుని ఆమె వేపే చూస్తూ చాలాసేపటినించి ఆ పాట వినే ప్రయత్నంలో ఉన్నాడు రామారావు. గాలి మోసుకొచ్చినప్పుడు తప్ప

పాట వినపట్టం లేదు. అలా కొంచెం కొంచెంగా వినబడుతున్న ఆ పాట మాధుర్యం రామారావుని కదలనివ్వలేదు.

జీవితంలో కొన్ని తీరని కోరికలు ఉంటాయి. అవి తీరే అవకాశం అంతగా లేదని తెలిసినా, ఆ కోరికల వాసన ఒక పట్టాన వదలిపోదు. ఇంచుమించు రామారావుకి అలాంటి కోరికే సంగీతం నేర్చుకోవాలన్నది. చదువుకునే రోజుల్లో ఒకటి, రెండు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

ఇప్పుడు సంగీతం నేర్చుకునే ఓర్పు, అవకాశం రెండూ తనకి లేవని రామారావుకి తెలుసు. అయినా, సంగీతం నేర్చుకుంటే ఎంత బాగుంటుందీ! అని ఇప్పటికీ అనుకుంటూనే ఉంటాడు. పాడటం రాకపోయినా, పాట అంటే చిన్నతనం నుంచీ ఉన్న ఇష్టం పోలేదు రామారావుకి.

ఇష్టమైన పాట విన్నప్పుడు ఎంత ఆనందపడతాడో, ఇష్టమైన పాట వినలేకపోయినప్పుడు అంతకన్నా ఎక్కువ బాధపడతాడు. ఇందాకటి నుంచి ఆ పాట అలా వినీ వినబడకుండా వినపడుతూ రామారావుని హాంట్ చేస్తోంది. చెట్టు దగ్గరికి వెళ్ళి ఆమెకి దగ్గరగా నిలబడి ఆ పాట వినాలనుంది. కానీ, దగ్గరగా వెడితే పాడటం మానేస్తుందేమోననే భయం. అందుకే కిటికీలోకి మరింతగా ఒదిగిపోయి, చెవుల్ని ఆ చెట్టునుంచి వచ్చే గాలికి అప్పజెప్పేసి కూర్చున్నాడు రామారావు.

కూర్చున్న అరుగుతోగాని, గాలికి కదులుతున్న చింత చెట్టుతోగాని, ఎదురుగా తన పాటకోసం ఆరాటపడుతూ కిటికీలో ఒదిగి కూర్చున్న రామారావుతో గాని తనకేం సంబంధం లేనట్టు, ఆ పరిసరాలతో తనకేం పనిలేనట్టు అలాగే పాడుకుంటూ కూర్చుంది ఆమె. మధ్యమధ్య పాట ఆపేసి చింతచెట్టుకి జార్లబడి, పైన కొమ్మల మధ్య తిరుగుతున్న గాలిని అనుభవిస్తున్నట్టు తల పైకెత్తి కూర్చునేది. మళ్ళీ కాస్సేపటికి ఆ గాలి ప్రేరేపించినట్టు, ఆ ఆకుల గలగల పాడమన్నట్టు పాడటం మొదలెట్టేది.

తనలో తను కలిసిపోయి ఆ అమ్మాయి అలా పాడుకోవటం చూస్తూ, రామారావు సైకిలు మీద మూర్తి రావటం, కిటికీ పక్కనే ఆగటం చూడలేదు.

"ఏమిటిరా అంత ఆలోచన?" అన్నాడు మూర్తి.

రామారావు జవాబు చెప్పలేదు.

"లోపలికి రారా" అన్నాడు.

మూర్తి ఏదేదో మాట్లాడుతున్నా, రామరావు ధ్యాసంతా చింతచెట్టు వేపే ఉంది.

ఆఖరికి ఇంక మూర్తితో చెప్పకుండా ఉండలేకపోయాడు.

చెట్టువేపు చూపిస్తూ "ఆ అమ్మాయి చాలా బాగా పాడుతోందిరా" అన్నాడు.

'బాగా పాడితే?' అన్నట్టు చూశాడు మూర్తి.

"నాకా పాట దగ్గరి నుంచి తృప్తిగా వినాలనుంది" అన్నాడు రామారావు తిరిగి.

రామారావు పాటల పిచ్చి మూర్తికి తెలియనిది కాదు. కాని, ఆ చెట్టుకింద బికారిలా కూర్చున్న ఆ అమ్మాయి పాట గురించి రామారావు అంతగా ఆరాటపడటం కొంచెం ఆశ్చర్యం కలిగించింది.

"ఎవర్రా ఆ అమ్మాయి?" అన్నాడు మూర్తి.

"ఏమో? ఎవరో? అడుక్కునే అమ్మాయేమో? గుడ్డిది. ప్రొద్దుటి నించీ అక్కడే ఉంది" అన్నాడు.

"అయితే, పొద్దుటి నుంచి కిటికీలో ఇలాగే కూర్చున్నావా?" అన్నాడు.

అవునన్నట్టు తల ఊపాడు రామారావు.

మూర్తికి కొద్దిగా నవ్వొచ్చింది. బయటికి రాకుండా ఆపేయాలనుకున్నాడు. కానీ, కుదరలేదు.

"నవ్వటం కాదు.... నాకు నిజంగా వినాలనుంది" అన్నాడు రామారావు తిరిగి.

"నిన్నంతగా ఎట్రాక్ట్ చేసిందేమిటి?" అన్నాడు మూర్తి ఆ అమ్మాయివేపు చూస్తూ.

"ఏమో? ప్రొద్దుటి నించీ వింటున్నాను. గాలిలోంచి వచ్చినట్టు కొద్ది కొద్దిగా వినిపిస్తోంది ఆమె గొంతు. వినిపించినప్పుడల్లా పరిసరాలన్నింటినీ మరిపించేంత ఫీలింగ్ ఏదో కలుగుతోంది. ఎలా ఎక్స్‌ప్రెస్ చెయ్యాలో తెలియటం లేదు. కానీ, ఆమె గొంతు, ప్రపంచంతో తనకేం సంబంధం లేదన్నట్టు అలా తనంతట తను పాడుకునే ఆ రూపం ప్రొద్దుటి నుంచీ వేటాడుతున్నాయి నన్ను" అన్నాడు రామారావు.

రామారావు అలా అన్నాక మూర్తికీ కొద్దిగా ఇంటరెస్ట్ కలిగింది.

"ఆ అమ్మాయి కూడా ఎవరేనా ఉన్నారా?" అన్నాడు మూర్తి.

"ఎవరో పదమూడు, పధ్నాలుగేళ్ళ కుర్రాడున్నాడు. వాడే ఇందాక కాస్సేపు మాట్లాడి వెళ్ళాడు" అన్నాడు రామారావు.

"వాడు రానీ, వాడితో మాట్లాడదాం" అన్నాడు మూర్తి. ఇలాంటి విషయాల్లో రామారావుకన్నా, మూర్తికి కాస్త చొరవ ఎక్కువ.

మూర్తితో ఏవేవో కబుర్లు చెప్పినా, ఆ కుర్రాడు కనపడి మూర్తి వాడితో మాట్లాడేవరకు పరధ్యానంగానే ఉన్నాడు రామారావు.

ఆ కుర్రాడు ముందు నసిగాడు. తర్వాత - "పాటలు యిన్నాక మీరు దయ సూపించాలి మరి" అన్నాడు.

డబ్బిస్తానని రామారావు అన్నాక వాడు ఒప్పుకున్నాడు, ఆ అమ్మాయిని తీసుకొచ్చి పాటలు పాడించటానికి.

ఆ అమ్మాయి తినటానికేదేనా తీసుకురావటానికి వెడుతున్నాని, తినేశాక మధ్యాహ్నం తీసుకు వస్తానని ఆ కుర్రాడు చెప్పడం వల్ల మూర్తి, రామారావు కూడా భోజనాల కోసం హోటల్‌కి బయలుదేరారు.

★ ★ ★

మధ్యాహ్నం రెండు దాటుతూండగా ఆ అమ్మాయిని చెయ్యి పట్టుకుని నడిపించుకుని తీసుకొచ్చాడు కుర్రాడు. గుమ్మం పక్కన గోడ వారగా కూర్చోపెట్టాడు.

"పేరేమిటి?" అనడిగాడు మూర్తి.

"లక్ష్మి" అన్నాడు కుర్రాడే బదులు చెపుతూ.

'మనిషి కొంచెం నలుపైనా, కళగానే ఉంది. సరైన పోషణ, విశ్రాంతి ఉంటే మరింత నిగారింపుగా తయారై ఉండేది' అనుకున్నాడు మూర్తి లక్ష్మివేపు చూస్తూ.

మరో రెండు, మూడు క్షణాలు గడిచాక - "నే నెల్లిరానా?" అన్నాడు కుర్రాడు.

"సరే" నన్నట్టు తల ఊపింది లక్ష్మి.

రామారావుకి, మూర్తికి కూడా చెప్పి ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు. ఎప్పుడు పాడుతుందా అన్నట్టు ఎదురు చూస్తూ కూర్చున్నాడు రామారావు. ఎప్పుడు అడుగుతారా అన్నట్టు గోడవేపు సర్దుకు, సర్దుకు కూర్చుని ఎదురు చూస్తోంది ఆమె. చివరికి మూర్తి చెప్పాక పాడటం మొదలెట్టింది.

మధ్య మధ్య పది, పదిహేను నిమిషాలు ఆగినా, రెండు గంటలసేపు అలాగే గోడకి ఆనుకుని

ఎన్నో పాటలు పాడింది లక్ష్మి.

ఎన్ని పాటలు విన్నా తృప్తి తీరనట్టు అలా వింటూనే కూర్చున్నాడు రామారావు. రామారావంత కాకపోయినా, మూర్తి ఇంటరెస్టిగానే విన్నాడు.

బాధని, సంతోషాన్ని గమ్మత్తుగా పలికే గొంతు, జీవితానికి ఎంతో దగ్గరగా ఉన్నట్టున్న ఆ పాటలు - అన్నీ ఎక్కడెక్కడో పల్లెపాటలే పాడింది.

ఈ జీవితం, కష్టసుఖాలు, తాపత్రయం - ఈ పరిధిని తాత్కాలికంగానేనా దాటేసినట్టు, ఏదో వివరించి చెప్పలేని తృప్తి అనుభవిస్తున్నట్టు ఆమె పాడినంతసేపూ అలా వింటూ కూర్చున్నాడు రామారావు.

పాటలు పాడకుండా మధ్యలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు లక్ష్మితో ఎక్కువగా మూర్తే మాట్లాడాడు.

తను పుట్టు గుడ్డిదని, చాలారోజులు తాత దగ్గర పెరిగిందని, చాలావరకు ఈ పాటలు ఆ ముసలాడి దగ్గరే నేర్చుకుందని, ఆ ముసలాడు చచ్చిపోయాక అడుక్కుంటూ ఇలా ఊళ్ళు పట్టుకు తిరుగుతోందని ఆ మాటల్లోనే చెప్పింది లక్ష్మి.

"ఇందాకటి ఆ కుర్రాడెవడు? మీ తమ్ముడా?" అనడిగాడు మూర్తి.

"కాదు. ఓ కడుపున పుట్టినోళ్ళం కాదు. ఒకే రకం బతుక్కదూ? నాకు సాయంగా ఉంటాడు" అంది.

లక్ష్మి మరి కాస్సేపు పాడాక, ఇంక చాలా అన్నట్టు చూశాడు మూర్తి, రామారావు వేపు.

అది చూసి లక్ష్మివేపు చూశాడు రామారావు. మనిషి కొద్దిగా ఆయాసపడుతున్నట్టు కనిపించింది. మూర్తి వేపు తిరిగి చాలన్నట్టు తల ఊపాడు.

"మంచినీళ్ళు కావాలా?" అనడిగాడు రామారావు లక్ష్మిని.

'కావా' లన్నట్టు తల ఊపింది.

లక్ష్మి నీళ్ళు తాగటం అయ్యాక -"నువ్వింత బాగా పాడతావని నీకు తెలుసా?" అన్నాడు రామారావు. లక్ష్మి పాటలవల్ల తను పొందిన తృప్తినంతా మాటల్లో చెప్పాలనుకున్నాడు. కాని, కుదరలేదు.

లక్ష్మి ఏమీ మాట్లాడలేదు.

"మావాడన్నది అర్థమైందా?" అన్నాడు మూర్తి.

"ఏమో? చిన్నప్పుడు మా తాత అనేవాడు - నా గొంతు ఎంతో బాగుందని, నా బంగారుతల్లి పెద్దయితే చాలా బాగా పాడుతుందని. అంతే. నాకంతకన్నా ఇంకేం తెలియదు" అంది.

రామారావు నెమ్మదిగా జేబులోంచి డబ్బు తీసి లక్ష్మి చేతికిచ్చాడు.

చేతిలో ఉన్న నోటుని తడిమి, తడిమి చూసుకుంటూంది.

"పది రూపాయల నోటు, చాలా?" అన్నాడు రామారావు.

చాలన్నట్టు వెంటనే తల ఊపింది లక్ష్మి. నోటుని తడుముతూ, వేళ్ళ మధ్య సాపు చేస్తూ అలాగే కూర్చుంది.

అంతకుముందు రెండు రోజలుగా సెలవు. ఎంతో పిచ్చిపిచ్చిగా గడిచింది సమయం రామారావుకి. అలాంటిది ఆ రోజు నిజమైన రిలీఫ్ దొరికినట్టనిపించింది. వినోదాల వల్ల మనుషులకు ఉండవలసిన నిజమైన తృప్తి ఇలాగే ఉండాలనిపించింది. అందుకే పది రూపాయలిస్తున్నాని, ఓ ముష్టి దానికి ఇది

ఎక్కువేనన్న దృష్టి రాలేదు రామారావుకి. లక్ష్మి అడిగితే ఇంకా ఇవ్వాలనే ఉంది రామారావుకి.

పావుగంట గడిచినా లక్ష్మి వెళ్ళే ప్రయత్నం చెయ్యకపోవటం చూసి, 'కుర్రాడి కోసం ఎదురు చూస్తుందేమో' అనుకున్నాడు.

"ఒక్కదానివీ వెళ్ళలేకపోతే కుర్రాడొచ్చేవరకూ కూర్చో, లేదా నన్ను తీసుకెళ్ళమంటే చెట్టుదాకా తీసుకెడతాను" అన్నాడు రామారావు.

ఓ క్షణం ఆగి, "అయితే, నిజంగా పాటలు వినటానికే పిలిచారా?" అంది లక్ష్మి నెమ్మదిగా.

రామారావుకి లక్ష్మి అంటున్నదేమిటో అర్థం కాలేదు. "అంటే?" అన్నాడు ఏమనాలో తోచక.

"అదే.... నాతో మీకింకేమేనా సరదా ఉంటే.... పాటల వంకతో పిలిచిన మీలాంటి ఒంటరి మగాళ్ళెవరూ ఇలా నన్ను ముట్టుకోకుండా పంపించెయ్యలేదెప్పుడూ" అంది లక్ష్మి చేతిలో నోటుని అలాగే తడుముతూ. అంతటి దారుణం తన గుడ్డి బతుకులో అతి మామూలు విషయంలా ఎందరో అలవాటు చేసినట్టుంది ఆమె గొంతు. లక్ష్మి అన్నది అర్థమయ్యాక రామారావు ఆలోచన ఒక్కసారి స్తంభించినట్టనిపించింది. లక్ష్మివేపు వెర్రిగా చూడటం తప్ప మరేం చెయ్యాలో తోచనట్టు అలాగే ఉండిపోయాడు.

ఎదుటివాళ్ళ నుంచి ఏం సమాధానం రాకపోయేసరికి తిరిగి లక్ష్మే అడిగింది - "ఉండ మంటారా?" అని.

రామారావుకి ఆ మాట వినిపించనట్టు అలాగే కూర్చున్నాడు. మూర్తి లేచి నెమ్మదిగా లక్ష్మి దగ్గరి కెళ్ళాడు.

అడుగుల చప్పుడు తెలుస్తున్నట్టు కొద్దిగా సర్దుకుని కూర్చుంది లక్ష్మి.

లక్ష్మి దగ్గరికి వెడుతున్న మూర్తిని చూసి రామారావు లేచాడు.

దగ్గరికెళ్ళి లక్ష్మి చెయ్యి పట్టుకుని లేవదీశాడు మూర్తి.

"దా, చెట్టు దగ్గర దింపుతాను" అన్నాడు ముందుకు నడుస్తూ.

వాళ్ళ వెనకాలే గుమ్మందాకా నడిచాడు రామారావు.

మూర్తి వెనకాలే నెమ్మదిగా నడుస్తున్న లక్ష్మిని చూస్తే గుండె కలుక్కుమంది. హత్య చెయ్యబడి దీనంగా పడిఉన్న కొన్నివేల పావురాల్ని చూసినంత బాధ కలిగింది రామారావుకి.

లక్ష్మిని దింపేసి మూర్తి తిరిగి వచ్చేవరకు అలాగే నిలబడ్డాడు గుమ్మంలో.

దగ్గరి కొచ్చాక రామారావు వేపు చూశాడు మూర్తి. చూసి నెమ్మదిగా అన్నాడు.

"చాలామందికి స్వచ్ఛమైన గాలిని, పువ్వుల్ని సవ్యంగా అనుభవించడం రాదు. అలాగే ఇదీను. బాధ పడకు" అన్నాడు.


- *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-3-1976*
- *మయూర, నవంబర్ 1976 (కన్నడం)*